క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఉదయం 7.30 గంటలకు ఆలయ కమిటీ ఉభయకర్తలుగా ఉత్సవ ఆరంభోత్సవం, సాయంత్రం 7 గంటలకు అంకురార్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న దీపా వెంకట్

వెంకటాచలం: యువత, మహిళలకు అందించిన సేవలకు గానూ స్వర్ణభారత్ ట్రస్ట్‌కు మరో పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన మొట్టమొదటి తెలుగు పోర్టల్ తెలుగు వన్ రజతోత్సవ వేడుకల్లో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్‌కు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ, చినజియ్యర్ స్వామి పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 24 ఏళ్లుగా తమ ట్రస్ట్ సేవలందిస్తోందన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు

నెల్లూరు(టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. కావలి విశ్వోదయ హైస్కూల్లో జరిగిన పది పరీక్షకు ఒక అభ్యాసకుడు హాజరయ్యారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరిగింది. ఇంటర్ పరీక్షలకు 160 మందికి గానూ 106 మంది అభ్యాసకులు హాజరయ్యారు.

నీరు లేక మరుగుదొడ్డికి తాళం



మూతపడిన పబ్లిక్ టాయిలెట్


నెల్లూరు రూరల్: కలెక్టరేట్‌లోని నగరపాలక సంస్థ పబ్లిక్ టాయిలెట్‌కు తాళం పడింది. ట్యాంక్‌లో నీరు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో సోమవారం అర్జీదారులు ఇబ్బంది పడ్డారు. మోటర్ వేసినా ట్యాంక్‌లోకి నీరు వెళ్లడం లేదని, అంతటికీ ఒక ట్యాంక్ మాత్రమే ఉందని, మరొకటి ఏర్పాటు చేస్తే మున్సిపల్ వాటర్ వచ్చినప్పుడు నింపవచ్చని సంబంధిత సిబ్బంది చెబుతున్నారు.

జాతీయ స్థాయిలో చిన్నారి ప్రతిభ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ ర్యాంకింగ్ ఓపెన్ నేషనల్ చాంపియన్ షిప్‌లో జిల్లాకు చెందిన చిన్నాబత్తిన నందిని 12–15 సంవత్సరాల విభాగంలో ఎనిమిదో ర్యాంక్ సాధించిందని జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుధీర్‌కుమార్, కె.కామేష్‌లు సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో 1,500 మీటర్ల విభాగంలో బంగారు పతకం, వెయ్యి మీటర్ల విభాగంలో సిల్వర్, 500 మీటర్ల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలియజేశారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన నందినిని అభినందించారు.

ముగిసిన ఆలిండియా చెస్ పోటీలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : స్థానిక గొలగమూడి రోడ్డులోని ఫన్‌పార్కు కన్వెన్షన్ హాల్లో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. ఇందులో చెన్నైకి చెందిన ఆర్.శ్యామ్ ప్రథమ స్థానంలో నిలువగా, రెండో స్థానంలో గుంటూరు జిల్లాకు చెందిన డి.దవేష్, తృతీయ స్థానంలో విజయవాడకు చెందిన వి.అభిరామ్, తరువాతి స్థానాల్లో తమిళనాడుకు చెందిన ఆకాష్, విజయవాడకు చెందిన శివ పవన్ తేజ నిలిచారు. ఫన్ పార్కు మేనేజింగ్ డైరెక్టర్ సాయి పొత్తూరి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం పడిగాపులే..

- కొడవలూరు రైల్వే గేట్ వద్ద తప్పని ట్రాఫిక్ పాట్లు
- ఫ్లై ఓవర్ నిర్మాణంతోనే సమస్యకు పరిష్కారం

మండలంలోని కొడవలూరు రైల్వేగేట్ వద్ద ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీ ఉండే ఈ ప్రాంతంలో రైల్వేగేట్ పడితే నిమిషాల్లోనే భారీగా వాహనాలు బారులు తీరుతాయి. ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మిస్తే తప్ప ట్రాఫిక్ సమస్యకు మోక్షం కలిగేలా లేదు. ప్రత్యామ్నాయంగా టపాతోపు వద్ద అండర్ పాస్ నిర్మాణం జరిగినప్పటికీ పెద్దగా ఫలితం కనిపించడం లేదు.



కొడవలూరు రైల్వే గేటు వద్ద వేచి ఉన్న వాహనాలు

కొడవలూరు: కొడవలూరు రైల్వే గేటు ఎంతో కీలకమైంది. నార్తురాజుపాళెం నుంచి మండల కేంద్రమైన కొడవలూరుతో పాటు మండలంలోని అనేక గ్రామాలకు, అల్లూరు, విడవలూరు మండలాలకు ఈ గేటు ద్వారానే వెళ్లాల్సి ఉంది. నెల్లూరు, కావలి వైపుల నుంచి వచ్చే వాహనాలు నార్తురాజుపాళెం వచ్చి అక్కడి నుంచి కొడవలూరు రైల్వే గేటు ద్వారా వెళ్తుంటాయి. దీంతో ఈ గేటు నిత్యం రద్దీగా ఉంటోంది. రైల్వే మూడో లైన్ ఏర్పాటుతో రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగి గేటు వద్ద మూడు లేదా నాలుగు రైళ్లు వెళ్లే వరకు గేటు తీయడం లేదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడైతే వేచి ఉండలేక వాహనదారులు అల్లాడిపోతున్నారు.

ఫలితమివ్వని అండర్ పాస్

కొడవలూరు రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని అక్కడికి ఒకటిన్నర కిలోమీటరు దూరంలోని టపాతోపు గేట్ వద్ద రైల్వే శాఖ రూ.11 కోట్లతో అండర్ పాస్ నిర్మించింది. ఇది ఏడాది క్రితం అందుబాటులోకి వచ్చింది. అయితే దీని ద్వారా చిన్న వాహనాలు మాత్రమే వెళ్లేందుకు అనుమతి ఉంది. దీంతో పెద్ద వాహనాలు కొడవలూరు గేటు ద్వారానే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా కావలి వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు విధిగా కొడవలూరు గేటునే వెళ్తున్నాయి. ఒకవేళ వారు టపాతోపు అండర్ పాస్ ద్వారా వెళ్లాలంటే అదనంగా మూడు కి.మీ దూరం పెరుగుతుంది. దీంతో ఈ గేటు వద్ద ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది.

రెండింతలు పెరిగిన అంచనా వ్యయం

ఇక్కడ 2015లోనే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదించారు. అందుకు రూ.50 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో 50 శాతం రైల్వే శాఖ భరిస్తుంది. మిగిలిన 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అప్పట్లోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. రైల్వే శాఖ తన వాటా రూ.25 కోట్లు ఇవ్వాలంటే నిబంధనలున్నాయంటూ ఈ ప్రాంతంలో మట్టి పరీక్షలు చేపట్టారు. ఇక్కడ పారుదల కాలువలున్నందున మట్టిలో పటుత్వం ఉండదన్న సాకు చూపి నిధులు మంజూరులో జాప్యం చేస్తూ వస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో నిర్మించాల్సి వచ్చినా అంచనా వ్యయం పెరుగుతోందంటూ దాటవేస్తూ వస్తున్నారు. ఫలితంగా ఫ్లైఓవర్ కార్యరూపం దాల్చక ట్రాఫిక్ సమస్య అలాగే ఉండిపోయింది. ఇప్పుడు నిర్మాణం చేపట్టాలన్నా అంచనా వ్యయం భారీగా పెరిగి సుమారు రూ.100 కోట్లకు పైగా వెచ్చించాల్సి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

సర్వేలతో సరి

ఫ్లై ఓవర్ నిర్మాణానికి 2015లో మూడు పర్యాయాలు సర్వే చేశారు. అనంతరం మట్టి పరీక్షలు కూడా చేశారు. తరువాత మిన్నకుండిపోయారు. మరలా గతేడాది ఆగస్టు 31న రైల్వే ఉన్నతాధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి కొడవలూరు ఫ్లై ఓవర్, రామన్నపాళెం అండర్ పాస్‌ల కోసం సర్వే చేశారు. చాలా ఏళ్ల తరువాత సర్వే జరగడంతో ఫ్లై ఓవర్‌కు కదలిక వచ్చిందని అందరూ ఆశించారు. కానీ ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు.



రామన్నపాళెం వద్ద సర్వే చేస్తున్న రైల్వే, రెవెన్యూ అధికారులు(ఫైల్)

ఇబ్బందులు తప్పడం లేదు



మండల కేంద్రానికి రావాలంటే నార్తురాజుపాళెం వచ్చి కొడవలూరు రైల్వే గేటు ద్వారానే వెళ్లాల్సి ఉంది. ఇక్కడ గేటు వేస్తే మూడు లేదా నాలుగు రైళ్లు వెళ్లే వరకు తీయడం లేదు. ఒకవేళ టపాతోపు అండర్ పాస్ నుంచి వెళ్దామంటే మూడు నుంచి నాలుగు కి.మీ అదనంగా ప్రయాణించాల్సి ఉంది. దీంతో కొడవలూరు గేటు వద్ద వేచి ఉండి ఇబ్బంది పడుతున్నాం.

– దేవనబోయిన శివకుమార్, రేగడిచెలిక

రోజూ అవస్థలే..



ప్రతిరోజూ ఒక ట్రెండు పర్యాయాలు నార్తురాజుపాళెం వెళ్లాలి. కొడవలూరు రైల్వే గేటు మీదుగానే రాకపోకలు ఉండడంతో పడిగాపులు తప్పడం లేదు. టపాతోపు అండర్ పాస్ ద్వారా వెళ్లాలంటే ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉండడంతో గేటు వద్దే వేచి ఉండిపోతున్నాం. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మిస్తామని ఎప్పట్నుంచో చెబుతున్నారు. కానీ కార్యరూపం దాల్చడం లేదు. ఫలితంగా మాకు అవస్థలు తప్పడం లేదు.

– కలిశెట్టి వెంకయ్య, తలమంచి

విద్యార్థులకు బహుమతుల అందజేత



వెంకటాచలం: మండలంలోని చవటపాళెం పంచాయతీ పరిధిలో సరస్వతీనగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణలో భాగంగా సోమవారం పలు విషయాలపై అవగాహన కల్పించారు. క్యాడెట్లకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ డి.కరంచంద్ అన్నారు. కార్యక్రమంలో మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, క్యాంప్ అధికారి బాలబ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



హాల్‌టికెట్ నంబర్లను పరిశీలిస్తున్న అధికారి

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో 21 మందికి గానూ 8 మంది హాజరయ్యారు. బాలికల హైస్కూల్లోని కేంద్రంలో 18 మందికి గానూ 12 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈఓ సుధీర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రమేష్ పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

పొదలకూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కో - ఆర్డినేటర్ అరుణ కోరారు. వ్యవసాయ శాఖ - రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బిరదవోలు గ్రామానికి చెందిన రైతులు కూరగాయల్ని ఉంచగా ఆమె సోమవారం పరిశీలించి మాట్లాడారు. బిరదవోలులో నిమ్మతోటల్లో అంతర పంటల కింద క్యారెట్‌ను ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించినట్లు చెప్పారు. హానికరమైన రసాయన ఎరువులను వినియోగించకుండా పూర్తి స్థాయిలో సంప్రదాయ పద్ధతిలో పంటల్ని పండిస్తున్నట్లు వెల్లడించారు.



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు

చిరు వర్షానికే చింత



జొన్నవాడ ఆలయ ముందుభాగంలో నిలిచిన వర్షపు నీరు



పట్టణంలో ముంబై రహదారిపై అంబేడ్కర్ విగ్రహం వద్ద ఇలా..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ, రూరల్ ప్రాంతాల్లో సోమవారం కురిసిన చిరు వర్షానికే రోడ్లపై నీరు నిలిచాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని ముంబై ప్రధాన రహదారితో పాటు వీధుల్లో గుంతలు ఏర్పడి ఉండటంతో వర్షపు నీరు నిలిచి పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. రూరల్ పరిధిలోని జొన్నవాడ, పెనుబల్లి చెల్లాయపాళెం, దామరమడుగు, మినగల్లు తదితర ప్రాంతాల్లో కూడా రోడ్లపై నీరు నిలిచాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా గ్రామాలు, పట్టణాల్లో రోడ్లు వేయకపోవడంతో చిరు వర్షానికే ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు అంటున్నారు.

యోగాతో మానసిక వికాసం

కొడవలూరు: యోగాసనాలతో మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వం సాధించవచ్చని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ అన్నారు. యోగా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల ఆవరణలో విద్యార్థులకు యోగాపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా సాధన ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా చదువులపై దృష్టి సారించవచ్చన్నారు. ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను రోజువారీ కార్యక్రమాల్లో భాగం చేసుకోవాలని సూచించారు.



విద్యార్థులకు యోగాపై శిక్షణ

కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ పీఓ పి.రవికుమార్, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ సీహెచ్.సతీష్, పీడీలు వై.ఫణికుమార్, కె.బాలు, ఏఓ కె.గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో క్విజ్ పోటీలు



కొడవలూరు : యల్లాయపాళెం గ్రంథాలయంలో..



కొడవలూరు గ్రంథాలయంలో..

కొడవలూరు: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వై.మునీంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ ఉండాలన్నారు. లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

కొడవలూరులో..

కొడవలూరులోని గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.రాజేశ్వరి గ్రంథాలయ పంచసూత్రాలను విద్యార్థులకు వివరించారు.

సుందరయ్యకు ఘన నివాళి

ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని శ్రామిక భవన్‌లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం మండల నాయకులు నిర్వహించారు. నేతలు గడ్డం అంకయ్య, విజయ్‌కుమార్, రామయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

➡ తోటపల్లిగూడూరు: ఇస్కపాళెం మల్లికార్జునపురం, పేడూరు, నరుకూరు, వెంకన్నపాళెం, ఎస్సీ కాలనీలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈపూరు లక్ష్మయ్య, కార్యదర్శి మారుబోయిన రాజా, మధు రాధయ్య, కొండయ్య, కాల్తిరెడ్డి, పరశురామయ్య, దయాకర్ పాల్గొన్నారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దివంగత సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబరుడని సీపీఎం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసలు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సీపీఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ సుందరయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

➡ కొడవలూరు: సుందరయ్య వర్ధంతిని మండలంలోని నార్తురాజుపాళెంలో సీఐటీయూ నేతలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క పరిశ్రమను ఏర్పాటు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. సీఐటీయూ నాయకులు తలారి నరసింహం, దేవానంద్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

➡ కోవూరు: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని స్థానిక సీపీఎం భవన్ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జక్కా శేషమ్మ, మారుబోయిన సుబ్బారావు, గండవరపు బుజ్జయ్యలు పూలమాలవేసి నివాళులర్పించారు. ఫాతిమా, పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి, బాబు, మల్లికార్జునరెడ్డి, బట్ట పెద్దబ్బయ్య, కాలేషా, షాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరులో నివాళులర్పిస్తున్న నాయకులు



బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో..



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..



కోవూరులో..

ట్రావెల్స్ బస్సుకు ప్రమాదం

- ఇద్దరికి తీవ్ర, పలువురికి స్వల్ప గాయాలు

మనుబోలు: రోడ్డు ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న వారు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని పొర్లు క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం వేకువజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. హరికృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు చెన్నై నుంచి గిద్దలూరుకు వెళ్తోంది. కొంతకాలంగా పొర్లు క్రాస్‌రోడ్డు వద్ద ఫ్లై ఓవర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇరువైపులా వాహనాలు వెళ్లేందుకు సర్వీస్ రోడ్లు వేశారు. డ్రైవర్ కొత్తగా నిర్మిస్తున్న ఫ్లై ఓవర్‌పైకి కొంత దూరం బస్సును నడిపాడు. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణానికి సంబంధించి వస్తువులు, గుంతలు గందరగోళంగా ఉండటంతో వేగానికి బస్సు ముందు అద్దాలు దెబ్బతిన్నాయి. 31 మంది ప్రయాణిస్తుండగా పలువురు గాయపడ్డారు. కొండమ్మ, గౌతమ్ అనే ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో ట్రావెల్స్ బస్సు

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో మరే ఇతర కారణమో తెలియదుగానీ గుర్తుతెలియని వ్యక్తి పొదలకూరురోడ్డు ఎస్పీ బంగ్లా సమీపంలో ఆదివారం అర్ధరాత్రి మృతిచెందారు. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉన్నాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 00018, 94403 33191కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్‌కు వినతుల అందజేత

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తహసీల్దార్ బి.శివకృష్ణయ్య నిర్వహించారు. భూ వివాదాలు, హద్దుల ఏర్పాటు, రీసర్వే జరిగిన గ్రామాల రైతుల నుంచి అర్జీలందాయి. వీఆర్వోల ద్వారా విచారణ నిర్వహించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

మినీ మహానాడుకు నేతల హాజరు

వెంకటాచలం: మండలంలోని వెంకటాచలంలో సోమవారం టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ మినీ మహానాడు జరిగింది. కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, డాక్టర్ జెడ్.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.